క్లుప్తంగా

నీలం మధుకు న్యాయవాదుల మద్దతు

పటాన్‌చెరు: మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని న్యాయవాదులు పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది తూము శ్రీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెల్లాపూర్‌లో నీలం మధుకు మద్దతుగా శనివారం న్యాయవాదుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధుకు సంపూర్ణ మద్దతునిస్తూ గెలుపు కోసం కృషి చేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ లీగల్ సెల్ కోఆర్డినేటర్ దామోదర్ రెడ్డి, టీపీసీసీ వైస్‌చైర్మన్లు చిన్నారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శశికాంత్, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ జగన్మోహన్‌రెడ్డి, సంగారెడ్డి లీగల్ సెల్, పార్లమెంట్ పరిశీలకులు శ్రీధర్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవకాశమివ్వండి అభివృద్ధి చేస్తా


మాట్లాడుతున్న ఎన్ఆర్ఐ మశ్చేందర్

కల్హేర్(నారాయణఖేడ్): జహీరాబాద్ ఎంపీగా గెలిపిస్తే జహీరాబాద్ ప్రాంతాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి గుర్రపు మశ్చేందర్ అన్నారు. మండల పరిధిలోని రాపర్తి, మీర్ఖాన్‌పేటతో పాటు నిజాంపేట మండలంలోని బాచేపల్లి, తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పేదల కోసం చేసిందేమీలేదన్నారు. కొత్త అభ్యర్థులను అవకాశం ఇవ్వాలని కోరారు. ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే జీవితాంతం ప్రజాసేవ చేస్తానని తెలిపారు. సింహం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కల్హేర్ ఎంపీపీ గుర్రపు సుశీల, నాయకులు శ్రీనివాస్, వెంకటేశం, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పండి

జహీరాబాద్: రాజకీయ లబ్ధి కోసం బీజేపీ రిజర్వేషన్లు తొలగిస్తున్నదని అసత్య ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి మాదిగలు గుణపాఠం చెప్పడం ఖాయమని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం అన్నారు. ఈ మేరకు జహీరాబాద్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు నమ్మొద్దన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఉల్లాస్, జైరాజ్, సుకుమార్, పవన్, శేఖర్, అభిలాష్, సత్యవీర్, సూర్య, విజయ్ పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రికి పటిష్ట భద్రత

- నియోజకవర్గంలో 411 పోలింగ్ కేంద్రాలు
- ఒక్కో బూత్‌కు 1,600 మంది ఓటర్లు
- 411 కేంద్రాలకు 513 ఎన్నికల సామగ్రి సెట్లు
- మైక్రో అబ్జర్వర్లు నియామకం



స్ట్రాంగ్ రూమ్ వద్ద కేంద్ర బలగాలు

పటాన్‌చెరు టౌన్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులు ఈవీఎంలను సిద్ధం చేశారు. వాటిని పటాన్‌చెరు మండలం రుద్రారం శ్రీ చైతన్య కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో పోలీస్ బందోబస్తు మధ్య భద్రపరిచారు. మెదక్ పార్లమెంట్ లోక్‌సభ పరిధిలో మొత్తం 44 మంది అభ్యర్థులు ఉన్నారు. 16 మంది కంటే అభ్యర్థులు ఎక్కువగా ఉండడంతో అధికారులు మూడు వీవీ ప్యాట్లను ఏర్పాటు చేస్తున్నారు.

513 ఎన్నికల సామగ్రి సెట్లు...

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో మొత్తం 391 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో పోలింగ్ బూత్‌లో 1600 మంది ఓటర్ల కన్నా ఎక్కువ ఉంటే అదే కేంద్రంలో బై-వన్ పేరుతో మరో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. మొత్తం 20 వరకు పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 411 కు చేరుకుంది. ఎన్నికల సామాగ్రిని ముందు రోజు ఆదివారం పటాన్ చెరు మండలం రుద్రారం చైతన్య కళాశాలలో ఎన్నికల సిబ్బందికి అందజేయనున్నారు.

మాక్ పోలింగ్ తర్వాతే..

పోలింగ్ నిర్వహణపై పటాన్‌చెరు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దేవుజా, మాస్టర్ ట్రైనర్లు సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.13వ తేదీ ఎన్నికల రోజు రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. పోలింగ్ బూత్‌లో మాక్ పోలింగ్ నిర్వహించి నేతల అనుమానాలను నివృత్తి చేస్తారు.

మైక్రో అబ్జర్వేషన్..

పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 411 పోలింగ్ కేంద్రాల్లో ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. 411 ప్రొసీడింగ్ ఆఫీసర్, 411 అసిస్టెంట్ ప్రొసీడింగ్ అదనపు పోలింగ్ ఆఫీసర్స్‌లకు ఎన్నికల నిర్వహణ పై శిక్షణ ఇచ్చాం. 47 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అందులో ప్రత్యేకంగా మైక్రో అబ్జర్వర్లని నియమించారు. 161 అదనంగా వీవీ ప్యాట్లు అదనంగా అందుబాటులో ఉంచాం. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– సహాయక రిటర్నింగ్ అధికారి దేవుజా

నరేంద్రమోదీతోనే దేశ భద్రత

జహీరాబాద్ రోడ్ షోలో సినీ నటి జీవిత


మాట్లాడుతున్న సినీనటి జీవిత

జహీరాబాద్: దేశ భద్రత, ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఒక్క నరేంద్ర మోదీతోనే సాధ్యమని సినీనటి, బీజేపీ రాష్ట్ర నాయకురాలు జీవిత రాజశేఖర్ అన్నారు. శనివారం జహీరాబాద్ పట్టణంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌కు మద్దతుగా భారీగా తరలివచ్చిన మహిళలతో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవిత మాట్లాడుతూ.. రాజకీయాల్లోనూ మహిళలను 33 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించిన ఘనత మోదీకే దక్కిందన్నారు. ప్రజలంతా ఎంపీ బీబీ పాటిల్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం.జైపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కె.జనార్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు ఉమాకాంత్ పాటిల్, విశ్వనాథ్‌స్వామి, అర్చన సారడా, శోభారాణి, మంజుల కౌశాస్, జీ.భాస్కర్, ఎం.పాండురంగారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఎం.సుభాష్‌రెడ్డి, బిడకన్నె హన్మంతు, ఎస్.అరుణ్ కుమార్, అశోక్ బెల్కెరి, జీ.చంద్రకాంత్, ఎం.కిరణ్, సంతోష్, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెతో సెల్ఫీలు దిగడానికి మహిళలు, యువతులు పోటీ పడ్డారు.

సొంత గూటికి మున్సిపల్ చైర్మన్

జగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక


విజయలక్ష్మికి కండువా కప్పుతున్న నిర్మలారెడ్డి

సంగారెడ్డి : జిల్లా కేంద్రం సంగారెడ్డిలో వలసల పరంపర కొనసాగుతుంది. రెండు నెలల కిందట నలుగురు మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా శనివారం మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ కొట్టిన మున్సిపల్ చైర్మన్ విజయలక్ష్మి రవి, మరో నలుగురు కౌన్సిలర్లతో కలిసి సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఆధ్వర్యంలో సొంతగూటికి చేరారు. కార్యక్రమంలో టీఐఐసీసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కూన సంతోష్ పాల్గొనగా, ఎండీ సోయల్ అలీ, అమీర్ బేగ్, మాజీ కౌన్సిలర్లు తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

ఎస్పీ చెన్నూరి రూపేశ్


మాట్లాడుతున్న ఎస్పీ రూపేశ్

సంగారెడ్డి : ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్ వివరించారు. 2,400 మంది పోలీస్ బలగాలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రచారం ముగియడానికి 48 గంటల ముందు ఎన్నికల అధికారి జిల్లా మొత్తం 144 సెక్షన్ జారీ చేయటం జరిగిందని, ఎక్కడ కూడా ప్రజలు అక్రమ సమావేశాలు, గుంపులుగా ఉండటానికి వీలులేదన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టి, ఎన్నికలను ప్రభావితం చేసే ఏ ఇతరములు అక్రమ రవాణా జరిగిన వెంటనే 1950 లేదా సీ విజిల్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చన్నారు.

మద్యం పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): 17 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్న సంఘటన కొల్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాన్‌పల్లికి చెందిన సుమత్, తెల్లాపూర్‌కు చెందిన మల్లేష్ వేరువేరుగా తెల్లాపూర్ నుంచి మద్యం తీసుకెళ్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా ఎన్నికల సందర్భంగా రెండు రోజులు మద్యం దుకాణాలు బంద్ ఉన్న కారణంగా మద్యం అమ్మేందుకు తీసుకెళ్తున్నట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలోని సరస్వతి దేవాలయ 19వ వార్షికోత్సవాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని సూచించారు.

గివేం ఎలచ్చన్లే.. గింత సప్పగున్నవి!

నర్సయ్య.. బాలయ్య.. ఇద్దరు దోస్తులు.. నర్సయ్య బీర్ కంపెన్ల పన్జేస్తడు.. బాలయ్య శేన్‌పన్జేస్తడు.. నర్సయ్య డ్యూటి దిగి ఇంటికి పోయి బుక్కెడు తిని.. టైంపాస్ కోసం బాలయ్య దగ్గర పోతడు.. ఇద్దరు గలిసి శౌరస్తలో కూసోని ముచ్చట పెడుతుంటరు.. చాయిదాక్కుంట.. దేశంల నడుస్తున్నవన్నీ సంగతులన్నీ మాట్లాడుకుంటరు.. కొద్ది సేపు సెల్‌ఫోన్లల్ల రీల్స్ జూశి నవ్వుకొని.. ఎక్కడక్కడ పోతుంటరు.. ఇప్పుడు ఎలచ్చన్లు నడుస్తున్నయి.. గదా.. ఈ దోస్తుల ముచ్చట రాజకీయం మీద మళ్లింది..

– పాత బాలప్రసాద్ / బ్యూరోఇన్‌చార్జి, ఉమ్మడి మెదక్ జిల్లా



సండే స్పెషల్

నర్సయ్య: అరె బాలిగా.. పదిగేను రోజుల నుంచి.. ఊర్లకు లీడర్ల పచారం ఆటోలొస్తున్నయ్.. మైకులల్ల పాటల్‌వెట్టి ఒక్క తీర్గా పచారం జేస్తున్నరు కాదా..

బాలయ్య: అనున్రా.. మైకులల్ల రోజు ఒర్రుతున్నరు గానీ.. ఒక్కల్లుగూడ ఇంటికచ్చి.. ఓటేయ్యుమని జెప్తలేరు.. నాల్నేల్ల కింద అయిన ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల ఓట్ల కోసం పతొక్కల్లు ఇంటికచ్చి ఒట్లేయ్‌మని అడిగింద్రు.. కానీ ఇప్పుడైతే ఒక్కలు గూడ రాలే.. గా ఎలచ్చన్లల్ల ఉన్న మజా ఇప్పుడు కనిపిస్త లేదురా..

నర్సయ్య: అవున్రా.. కంపెన్ల నాకిప్పుడు రాత్రి షిఫ్టు నడుస్తుంది.. అందుకనే రోజంత ఇంట్లనే ఉంటున్న.. మా ఇంటికే గాదు., మా వాడక్కుడా లీడర్లేవడ్రాలే.. పోయిన ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల ఊర్లున్న లీడర్లు కూడా బాగానే ఎల్లాడింద్రు.

బాలయ్య: ఇంటింటికి తిరుగుడు ఎక్కడ సాధ్యమైతదిరా.. ఎమ్మెల్యే ఎలచ్చన్లంటే మూడు నాలుగు మండలాలే ఉంటయి.. ఇంటింటికి తిరగస్తది.. గానీ ఇవి ఎంపీ ఎలచ్చన్లు గదరా.. పోటి జేశేవాల్లు ఈ మూల నుంచి ఆ మూలకు పోవాలంటే యాడికేంచయితదిరా.. ఎంపీ అంటే రెండు, మూడు జిల్లల్లాకు ఒకరుంటరు..

నర్సయ్య: ఊర్లన్ను లీడర్లు గూడ ఎక్కువ తిరుగతలేర్రా.. ఎండలకు బయట తిరగాలంటే కూడా ఎనుకాముందు అవుతుండ్రు.. ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల ఊర్ల లీడర్లు మస్త్ ఎల్లాడింద్రు గానీ ఇప్పుడు పెద్దగ సప్పుడు చేస్తలేరు..

బాలయ్య: ఎమ్మెల్యే ఎలచ్చన్లల్ల మన ఊర్ల బాగనే దావత్లైనయి.. శికెన్లు.. మేకలు కూడా కోశింద్రు.. బాటిల్లు కూడా ఇచ్చింద్రు..

నర్సయ్య: అయినా వాళ్లిచ్చేదేందీరా.. మన దావత్ మనమే జేసుకుంటాం కాదా.. వాల్లిచ్చేదానికి మనం ఎప్పుడైనా ఆశపడ్డమా.. ఎలచ్చన్లప్పుడే వాళ్లు దావత్‌లిస్తరు.. మల్ల మన మొకం జూడరు.. ఎప్పుడు కూడా మనమే దావత్‌లు చేసుకుంటం.

ఇంతకు నువ్వు ఓటు ఓల్లకేస్తవు..

బాలయ్య: నీ కొడుకు తరుణ్ గానికి ఓటక్కొచ్చిందారా..

ఎవరు గెలుస్తరో తెలుస్తలేదు..

బాలయ్య: అవును గనీ.. మొన్న సంగరెడ్డికి మీటింగ్‌కు పోయినవటా.. నేను ఆరోజు మాసడ్డకునికి బియ్యం పోస్తుండ్రంటే ప్యాటకు పోయిన..

నర్సయ్య: అవు.. మీటింగ్‌కు పాయిన.. మన బుచ్చిరెడ్డి తీస్కపోయిండు.. డీసీఎంల వోయినం.. ఐదువందలిచ్చింద్రు.. మీటింగ్‌కు మంది గూడ బాగనే వచ్చింద్రు.. కనీ ఎండ తీసుడు తీసింది.. మాడవలిగింది..మీటింగ్ పోయివచ్చినంక రెండ్రోలు మనిషినిగాలే.. నువ్వు ఆ మీటింగ్‌కు రాన్దేనయమైంది.. వచ్చింటే నువ్వుగూడ పరేషానైతుంటివి.

బాలయ్య: అన్ని పార్టీల మీటింగ్‌లకు మంది బాగానే అస్తున్నరు.. కనీ ఎవరు గెలుస్తరో తెలుస్తలేదు.. అవుగనీ రేపేరా.. ఎలచ్చన్లు.. మనం ఓటేయ్యాలే.. హైద్రబాదుల పనిజేసే మీ తమ్ముడు శీను ఓటేయడానికి వచ్చిండారా..

నర్సయ్య: ఓట్లున్నయని ఆడికి సెలవిచ్చింద్రట.. వాని భార్య, పిల్లలను తీసుకుని నిన్న పొద్దుగూకినంక అచ్చిండు..

నర్సయ్య : మొన్ననే అచ్చింది.. పేర్రాపిచ్చిన.. ఓటర్‌కార్డు కూడా వచ్చింది. ఈ ఎలచ్చన్ల వాడు వస్తుసారి ఓటేస్తడు.

బాలయ్య: ఔరా నర్సయ్య.. ఇంతకు నువ్వు ఓటు ఓల్లకేస్తవు.. ఈ ఎన్నికలల్ల వోల్లు గెలుస్తరంటవ్..

నర్సయ్య: బీజేపోల్లు మోదీ అనవట్టే.. కాంగ్రెసోల్లేమో రేవంత్‌రెడ్డి.. రావుల్‌గాంధీ పేర్లు జెప్తుండ్రు.. కారు పార్టోల్లు కేసీఆర్ అంటుండ్రు. మిగిలిన పార్టోల్లు.. ఇండిపెండెంట్లు గూడా జోరుగనే పచారం చేస్తున్నరు.. ఎన్నికలల్ల నిలవట్లోలు మాత్రం మేం గెలుస్తమంటే.. మేం గెలుస్తుమని జెప్తున్నరు.. మమ్మల్ని గెలిపిస్తే ఇదిస్తం అంటున్నరు.. మేమేం గెలిస్తే అది జేస్తం అంటున్నరు.. ఆలోచన జేసి ఓటేస్తా..

తప్పకుండా ఓటెయ్యాలే..

బాలయ్య: అవును.. అందరు చెప్పేవి వినాలే.. ఆలోచన జేశి ఓటేయ్యాలే. తప్పకుండా ఓటెయ్యాలే. ఆగమాగం కావద్దు.. ఓల్లు మనకు మంచి చేసిండు.. అన్నీ ఆలోచన జేశి ఓటెయ్యాలే.. ఒకవేళ పోటీలో ఉన్నోల్లు ఎవ్వరు నచ్చకపోయినా.. నోటా కన్న గుద్దిరావాలే.. కనీ ఓటు మాత్రం తప్పకవేయాలి. నువ్వు కూడా మీ ఇంట్లోల్లందరితోటి ఓటేపియ్యి..

నర్సయ్య: బరాబర్ వేస్తా.. ఒటక్కొన్నొల్లందరితోటి ఓటేపిస్తా.. ఇగ ఇంటికి పోదాంరా.. ఆకలైతోంది.. బుక్కెడంత తిని పండుకుందాం.. చాయ్ పైసల్ పోన్‌పే జేసి.. ఇద్దరు గూడ బండి స్టాట్ చేసుకుని ఇండ్లల్లకు పోయింద్రు. మనం ఓటేయడానికి పోలింగ్ కేంద్రానికి పోదాం పదండ్రి..

ఒకే రకమైన రెమ్యునరేషన్ ఇవ్వండి

టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన రెమ్యునరేషన్ ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్ అన్నారు. పోలింగ్ పూర్తయిన తరువాత పోలింగ్ సిబ్బంది వారివారి స్వస్థలాలకు వెళ్లడానికి బస్సు సదుపాయం కల్పించాలని కోరుతూ శనివారం ఖేడ్ ఆర్డీఓ అశోక చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి ఒకే రకమైన రెమ్యునరేషన్ ఇవ్వాలని తెలంగాణ సీఈఓ శుక్రవారం ఆర్వో, డీఆర్వోలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ కార్యదర్శి ఏశప్ప, రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాత్ జాదవ్, ఖేడ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు హరిసింగ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి

- ఎమ్మెల్యే మాణిక్‌రావు
- ముమ్మరంగా ఇంటింటి ప్రచారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా శుండల పరిధిలోని రాజోల తదితర గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని వడ్డి గ్రామంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు, ప్రజా ప్రతినిధులు ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నియామకం

జహీరాబాద్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా జహీరాబాద్ పట్టణానికి చెందిన విజేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. విజేందర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

◆ గుర్తుతెలియని వ్యక్తి మృతి

కల్హేర్(నారాయణఖేడ్): గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపేట మండల పరిధిలోని మునిగేపల్లి గేటు వద్ద అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికులు గమనించి 108లో చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని ఆస్పత్రిలో భద్రపర్చినట్లు తెలిపారు. ఎవరికైనా తెలిస్తే కల్హేర్ పోలీస్టేషన్ 8712656761 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

◆ భక్తిశ్రద్ధలతో చండీహోమం

కల్హేర్(నారాయణఖేడ్): నిజాంపేట మండలంలోని బల్కంచెల్క తండా (భక్తిధాం తండా)లో విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో ధర్మకర్త, మేడ్చల్ జిల్లా రవాణాశాఖ అధికారి మూడ్ కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో లోక కల్యాణం కోసం చండీహోమం నిర్వహించారు. టీవీ ఆర్టిస్టు సిద్ధంతి బ్రహ్మశ్రీ చంద్రమౌళీశ్వర శర్మ దంపతులు, ఔరంగబాద్‌కు చెందిన వేద పండితులు అనుప్‌శర్మ, మందిరం ప్రధాన అర్చకులు మనోజ్‌శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్, తండా ప్రముఖులు రూప్‌సింగ్, రాములు, శంకర్, సవాయ్‌సింగ్, మన్మోహన్‌నాయక్, కిషన్, జైల్‌సింగ్ పాల్గొన్నారు.

◆ పోలింగ్ కేంద్రాల పరిశీలన

జిన్నారం: బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం మున్సిపల్ కమిషనర్ మంగతాయారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు

◆ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన రామచంద్రాపురం పట్టణంలోని సాయినగర్ కాలనీలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు పట్టణంలోని చైతన్యపురి కాలనీకి చెందిన మహేష్ వాటర్‌వర్క్స్‌లో పనిచేస్తున్నాడు. కాగా సాయినగర్ కాలనీలో అశ్విన్‌గౌడ్ ఇంటిలోని నీటి సంపును శుభ్రం చేసేందుకు లోపలికి దిగాడు. ఈ క్రమంలో సంపులో ఉన్న మోటార్‌కు ఉన్న విద్యుత్ వైర్లు మహేష్‌కు తగలడంతో సంపులోనే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సంపులో మోటార్ వైర్లను నిర్లక్ష్యంగా ఉంచినందుకు ఇంటి యాజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌లో చేరేవారికి గుర్తింపునిస్తాం

మంత్రి దామోదర రాజనర్సింహ


పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న మంత్రి దామోదర

మునిపల్లి(అందోల్): కాంగ్రెస్‌లో చేరేవారికి గుర్తింపునిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. మండల పరిధిలోని తాటిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ రాంరెడ్డి, సర్పంచ్ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి దామోదర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు వెంకట్‌రెడ్డి, నరసింహారెడ్డి, కొండల్‌రెడ్డి, సికిందర్ రెడ్డి, తిరుపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

హత్నూర మండల పరిధిలో...

హత్నూర సంగారెడ్డి): మండల పరిధిలోని చందాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో చందాపూర్ గ్రామానికి చెందిన గమ్యం అసోసియేషన్ చైర్మన్ సురేందర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులు పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి కాంగ్రెస్ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర మహిళా నాయకురాలు సువాసినిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు తలారి రాజేందర్, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, మాజీ జెడ్పీటీసీ జయశ్రీ, నాయకులు శ్రావణ్, విప్లవకన్నా, మనీదీప్, ప్రసాద్, పాల్గొన్నారు.

టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ ఆధ్వర్యంలో


కాంగ్రెస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ముర్తుజాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మాజీద్ పటేల్‌తో పాటు 40 మంది కార్యకర్తలు టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ తన్వీర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రప్ప, సిద్దిలింగయ్యస్వామి, గౌసొద్దీన్, రఫీయోద్దీన్, జనార్ధన్‌రెడ్డి, దత్తారెడ్డి, హజం పటేల్ పాల్గొన్నారు.